క్లుప్తంగా

బాలినేనిని కలిసిన వెన్నా



బాలినేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం టౌన్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో సోమవారం ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిర కలిసి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని బాలినేనిని కోరినట్లు వెన్నా తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

పొదిలి రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని మండల జేసీఎస్ కన్వీనర్ పేరం సుభాష్‌చంద్రబోస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని కుంచేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో కొమ్మసాని వెంకటరెడ్డి, పేరం నాగిరెడ్డి,అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, సచివాలయం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలి

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్షపై ఆరోగ్య ప్రజలకు అవగాహన కల్పించాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి మహబూబ్ షరీఫ్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోటగడ్డ వీధిలో సోమవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఇంటింటా తిరుగుతూ వారి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అక్టోబర్ 7వ తేదీన అర్బన్ పీహెచ్‌సీలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సూపర్‌వైజర్లు సుధారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు మార్కాపురంలో విద్యుత్ నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు రూరల్ మండలంలో బుధవారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ షియానాయక్ తెలిపారు. దరిమడుగు వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

దర్శి: తన కోరిక తీర్చాలని అసభ్యకరంగా మాట్లాడి కర్రతో తలపై కొట్టారనే ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్శి పుచ్చల మిట్టలో నివాసం ఉంటున్న చింతలపూడి క్రాంతి, ముద్దాయి షేక్ లతీఫ్‌లు గత మూడు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. వీరిద్దరికి మధ్య మూడు నెలల నుండి మనస్పర్థలు వచ్చాయి. క్రాంతి అద్దంకి రోడ్డులోని టీవీఎస్‌షోరూం వద్ద ఉండగా.. ముద్దాయి లతీఫ్ వచ్చి అసభ్యకరంగా మాట్లాడి ఆమెతో గొడవ పడి కర్ర తీసుకుని తలపై కొట్టాడు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

త్రిపురాంతకం: ఎస్సీ,ఎస్టీ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు జి.ఏడుకొండలును మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు పదోన్నతి పొంది మద్దిపాడు మండలం తెల్లబాడు నుంచి బదిలీపై వచ్చారు. ఈయన్ను సన్మానించిన వారిలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్తర్ల వెంకట సుబ్బారావు, కె.బుజ్జి, జోసఫ్, ఉపాధ్యాయులు భాస్కర్, నరేష్, శంకర్, రవి, బాలరాజు, సుభానీ పాల్గొన్నారు.

కురిచేడు మండలంలో ప్రత్యేక శానిటేషన్ డే

కురిచేడు: మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం ప్రత్యేక శానిటేషన్ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు తెలిపారు. పూడిక తీసి బ్లీచింగ్ చల్లించినట్లు తెలిపారు. కార్యదర్శులు శానిటేషన్ వర్కర్లతో గ్రామాలను పరిశుభ్రం చేయించినట్లు తెలిపారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి

బేస్తవారిపేట: ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా రైతులకు రసీదులు ఇవ్వాలని గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం బేస్తవారిపేటలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రూ.2 లక్షల ఎరువులకు ఓ ఫారం లేకపోవడంతో అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏఓ జక్కం మెర్సీ, ఏఈఓలు పాల్గొన్నారు.



త్రిపురాంతకం: శ్రీవాసవీ అమ్మవారి ఆలయంలో..



పెద్దారవీడు: వినాయకునికి పూజలు చేస్తున్న రాఘవేంద్ర



బేస్తవారిపేట: నెహ్రూబజార్‌లో కొలువుదీరిన గణనాథుడు



వై.పాలెం: కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం



గొట్లగట్టులో పూజలందుకుంటున్న వినాయకుడు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..



ఎమ్మెల్యే అన్నాను సత్కరిస్తున్న స్వర్ణగణపతి నిర్వాహకులు



మార్కాపురంలో మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న డాక్టర్ కనకదుర్గ



దరిమడుగు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



తర్లుపాడులో గణేశ్ విగ్రహం వద్ద కమిటీ సభ్యులు



పొదిలిలో నూర్జహాన్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



కంభం: విగ్రహాలకు గ్రామోత్సవం



కురిచేడు: పూజలందుకున్న గణనాథుడు



తాళ్లూరు మండలం కొత్తపాలెంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి



దర్శి: వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దంపతులు



ముండ్లమూరు: పసుపుగల్లులో వినాయక చవితి వేడుకలు



దొనకొండ: ముస్తాబైన వినాయకుడు

గిద్దలూరు రూరల్: వినాయక చవితి సందర్భంగా భక్తులు మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని పలు వీధుల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని షరాబ్ బజారులోని స్వర్ణగణపతిని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మండలంలోని ముండ్లపాడులో, పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్‌లోని వినాయకుడి విగ్రహం వద్ద, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వస్త్ర గణపతి, యల్లావారి వీధిలోని వినాయకుడి విగ్రహం వద్ద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని నల్లబండ బజారు, రాజానగర్, రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరకాలనీ, ఎల్ఐసీ కార్యాలయం వీధి, పాతసత్యనారాయణ థియేటర్ వీధి, పాములపల్లె రోడ్డు వంటి వీధులల్లో భక్తులు పెద్ద ఎత్తున వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. మండపాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళవారం అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

బేస్తవారిపేట: మండల ప్రజలు వినాయచవితి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలతో పందిళ్లు అలంకరించారు. వినాయకుడి విగ్రహాలు మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. బేస్తవారిపేట నెహ్రూ బజార్‌లో ఏర్పాటు చేసిన యానిమేషన్ వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

త్రిపురాంతకం: వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రోజూ గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకంలోని కార్యసిద్ధి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో ఆలయంలో గణపతి వ్రత పూజలో పాల్గొన్నారు.

పుల్లలచెరువు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథులు వాడవాడలా కొలువుదీరారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీ కళాక్షేత్రం, కమ్మవారిపల్లి, గంగవరం గ్రామం హరిజనవాడ, ముతరాసు కాలనీ, బ్రహ్మం గారి వీధి యాదవ బజార్, లంబాడ తండాలో వివిధ ఆకారాలతో గణనాథులు కొలువుదీరారు. సోమవారం ఉదయాన్నే ఊరేగింపులతో వినాయకుడి విగ్రహాలను మండపాలకు చేర్చి అందంగా అలంకరించారు. అనంతరం గ్రామంలోని దంపతులు పీటలపై కూర్చుని గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండపాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కంభం: వినాయక చవితి పండగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకోగా మంగళవారం నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. సుమారు వందకుపైగా విగ్రహాలను కంభం చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలో విగ్రహాలు కందులాపురం కూడలి, జామియా మసీదు సెంటర్, చౌక్‌సెంటర్, అంకాళమ్మ తిప్ప మీదుగా గ్రామోత్సవంగా కంభం చెరువుకు వెళ్లి నిమజ్జనం చేశారు. చెరువు కట్టపైకి తీసుకెళ్లిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు 20 మంది ఈతగాళ్లను పోలీసులు అందుబాటులో ఉంచారు. గ్రామోత్సవం సందర్భంగా పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంభం సీఐ రాజేష్‌కుమార్, ఎస్‌ఐ పులి రాజేష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మండలంలోని జంగంగుంట్లలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో లడ్డూ వేలం పాట పోటాపోటీగా జరిగింది. కాటం రెడ్డి రాజశేఖర్ రెడ్డి రూ.1,60000/ లడ్డూను సొంతం చేసుకున్నారు.

యర్రగొండపాలెం: వినాయక చవితి పండగను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. భక్తులు మట్టితో చేసిన గణపతులకు ప్రాధాన్యం ఇచ్చి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం భక్తులను అకట్టుకుంది.

పెద్దారవీడు: మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక స్వామికి ప్రజలు భక్తిశ్రద్ధలతో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లలో వినాయకుని స్వామి వద్ద పత్రిక, కాయలు, పుస్తకాలు, నైవేద్యం సమర్పించారు. మంగళవారం ఉదయాన్నే చిన్నారులు వినాయక స్వామిని గ్రామం సమీపంలో ఉన్న చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో దేవాలయాల్లో వినాయకుని విగ్రాహాలు ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దారవీడు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు అర్చకులు మేడవరం రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్దారవీడులో శ్రీరాజ విద్యాశ్రమంలో భద్రయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పెద్దదోర్నాల: వినాయక చవితి పర్వదినాన్ని మండల ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వేకువ జాము నుంచే వివిధ దేవాలయాల్లో ఆది దేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ ప్రాంతంలోని వెలుగొండ ప్రాజెక్టు కార్యాలయంలో వినాయకుని ప్రత్యేక పూజలు చేశారు. మెఘా ఇంజినీరింగ్ అధికారులు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించి విఘ్నాలన్నీ తొలగి ప్రాజెక్టు పూర్తి కావాలని ప్రత్యేక పూజలు చేశారు. మయండల కేంద్రంలోని నాయక నగర్, వెచ్చావెంకట సుబ్బయ్య వీధి, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, హీరో షోరూం, కరెంట్ ఆఫీస్, మెట్టబజార్, కుమ్మరి కాలనీ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అలయంలో ఏర్పాటు చేసిన మట్టి గాజుల విగ్రహం భక్తులను ఆకట్టుకుంది.



పెద్దదోర్నాల: కొత్తూరు వద్ద సొరంగ నిర్మాణ ప్రాంతంలో..

మార్కాపురం/మార్కాపురం రూరల్/తర్లుపాడు/పొదిలి/పొదిలి రూరల్/కొనకనమిట్ల: వినాయక చవితి పర్వదినాన్ని మార్కాపురం నియోజకవర్గంలో వాడవాడలా సోమ, మంగళవారాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దండాలయ్యా.. ఉండ్రాలయ్యా అంటూ గణనాథునికి పత్రి, పండ్లు, పూలు, వడపప్పు, పానకం సమర్పించి విశేష పూజలు చేశారు. గ్రామాలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని రైతన్నలు విఘ్నేశ్వరస్వామిని వేడుకున్నారు. పల్లె ప్రాంతాలు, పట్టణాల్లోని వీధులు గణేశ్ మండపాలతో కళకళలాడాయి.

- మార్కాపురం పట్టణంలో సుమారు 40 చోట్ల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థానం సభ్యురాలు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, వైఎస్సార్‌సిపి నేత ప్రమీలారెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, ఏరువ శివనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మట్టి వినాయక ప్రతిమలను పట్టణంలోని పాత బస్టాండులో ఉచితంగా అందజేశారు. కాగా నెహ్రూబజారులోని దశవతార వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.
- తర్లుపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయగిరి సురేంద్రబాబు అన్నదానం నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షులు కస్సెట్టి జగన్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం మట్టి విగ్రహాలను అందజేశారు. అన్నదాతలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.
- కొనకనమిట్ల మండలం గొట్లగట్టులో చిన్నారులు మట్టి గణపతి ప్రతిమలను ఊరేగిస్తూ ఇంటింటికి తిరిగి పూజలు చేయించారు. పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను రెండో రోజు మంగళవారం నిమజ్జనం చేశారు. వినాయకునికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలను వేలం వేశారు. .
- పొదిలి ప్రకాశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నూర్జహాన్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఉత్సవంలో పాల్గొని అన్నదానం చేస్తున్న నూర్జహాన్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

దర్శి: రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెంకటరెడ్డి దంపతుల సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.

కురిచేడు: కులమత సామాజిక వర్గ భేదాలను విడిచి అంతా ఒక్కటై పూజలు చేస్తూ సహపంక్తి భోజనాలు చేస్తూ కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నారు. మండలంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ముండ్లమూరు: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఎస్సై యూవీ కృష్ణయ్య పలు గ్రామాల్లో పర్యటించి కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు అందించారు.

తాళ్లూరు (ముండ్లమూరు): కొత్తపాలెం గ్రామంలో జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఎస్సై ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు.

దొనకొండ: ఆడ పడుచులు తలంటి స్నానాలు చేసి వినాయకునికి పూజలు చేశారు. పూజారులు పూజా కార్యక్రమం నిర్వహించి ప్రసాదం అందజేశారు.